స్కెచ్

# అడ్డంతిరిగిన విజయం

దుత్తా దుర్గాప్రసాద్

ఎలాంటి వ్యక్తి అయినా కానీండి, ప్లాట్‌ఫారమ్ మీదికొచ్చేసరికి ఓ వింత అవతారం ఎత్తుతాడు. బండిలోకి ఎక్కేందాకా అతిదీనంగా, ఏమీ చేత కాని వాడిలా ప్రతిఒక్కడి సహాయాన్నీ అభ్యర్థిస్తున్నవాడిలా పోజు పెడతాడు. బండిలోకెక్కి కాస్త సామానూ అదీ సర్దుకోగానే పరమ క్రూరుడూ, స్వార్థపరుడూ అయిపోతాడు. తన కోసమే ఆ బండి అనేది ఆ స్టేషన్‌లో ఆగినట్టూ, తాను ఎక్కాడు కనుక యికనది నిరభ్యంతరంగా సాగిపోవచ్చునన్నట్టూ, తలుపు బిగించి, తాళం వేసినంతపనిచేసి యిక అందులో ఎవరైనా ఎక్కబోతే, "యిందులో ఖాళీలేద"నో, "యిది ఐస్ కంపార్టుమెంటు" అనో, లేకపోతే "రిజర్వుడు బోగీ" అనో కోసేస్తాడు.

"మేష్టారూ, కాస్త బెడ్ చుట్టండీ!"

చినగంజాం స్టేషననుకొంటాను. వెధవబండి అరగంటసేపు ఆగింది. గాలి ఆడక ఒళ్ళంతా చెమట పట్టింది. ఇక ఊపిరాడదేమో ననుకొంటూండగా అప్పుడే బండి కదిలింది. కాస్తచల్లగాలి తగిలేసరికి ప్రాణానికి హాయిఅనిపించింది, అప్పుడే కునుకు పడుతూఉంది. ఇంతలోకే ఈ పెద్దమనిషి లెమ్మంటున్నాడు! అందులో మహాఘురానాగా, ఏకంగా బెడ్డే చుట్టమంటున్నాడు!

"ఏమండోయ్ కాస్త బెడ్డు చుట్టాలి!"

ఈమాట గట్టిగా చాలా చిరాగ్గా అన్నట్టు వినబడింది. ఒళ్లు మండిపోయింది నాకు. లేవమని అడిగే హక్కు ఆయనకు ఉండవచ్చు. లేవవలసిన బాధ్యతా నామీద ఉండొచ్చు. కాని అంత ఘాటుగా అడగడమనేది, హనుమంతరావుబోటి వీరుడితో ప్రయాణంచేస్తున్న నాకేమీ నచ్చలేదు. కళ్ళుతెరిచి పైకి చూశాను. 'బర్తు' మీది నుంచి హనుమంతొయ్ గురక నాకు ధైర్యం చెప్పింది.

"సారీసార్" అన్నాను తాపీగా.

'చోటివ్వమంటుంటే సారీ అంటావేమిటయ్యా?'

ఏకవచన ప్రయోగం ముళ్లకర్రతో పొడిచినట్టయింది. ఛర్రున లేచి "మిష్టర్, కాస్త మర్యాదగా మాట్లాడితే ఎందుకైనామంచిది తెలిసిందా" అన్నాను.

"ముందు మీరు లేస్తారా, లేవరా?"

"ఛస్తే లేవను."

"దేనికి లేవరని?"

"నాకిష్టంలేదు కాబట్టి."

"అంటే!"

ఈయన్ని మాటలతోటే దెబ్బకొట్టాలని, నశ్యం పీల్చిన పంతులులా కంఠం మార్చాను. "ఏమండోయ్, మనుషులమై పుట్టి మనుష్యుల్లా పెరుగుతున్నాక, మర్యాదనేది నేర్చుకోవాలి. ఎదటివాడిని గౌరవించి ఎంతపనైనా చేయించుకోవచ్చును. మీరు..." నాటకంలోలాగా చెప్పుకుపోతున్నవాణ్ణి అడ్డంకొట్టి "మిమ్మల్ని లేవమంటున్నాను. అంతేకాని నీతులు బోధించమనడంలేదు" అన్నాడాయన.

"అందుకే లేవనంటున్నాను" అన్నాను.

"అయితే గార్డుని పిలవాల్సొస్తుంది."

"మహారాజుగా పిలవండి. నేనే కనుక్కొంటాను మనిషితో మనిషి యిలాగేనేమో మాట్లాడేది?"

"ఏమండీ,పాపం ఆయన నెల్లూరినుంచి నిల్చునే వస్తున్నారు. కాస్త పడుకోనియ్యండి. మీరిలా వచ్చి కూర్చోండి, నేను చీరాల స్టేషన్లో దిగుతాను" అన్నాడు, ఈ ఫార్సంతా వింటోన్న ఎదటి బెంచీమీది ముసలాయన, నన్నే సమర్థిస్తూ.

"నెల్లూరునుండి రానీయండీ, మద్రాసునుండి రానీయండి. ఇక్కడ పడుకోమని ఎక్కడా రూల్ లేదు."

"రూలుందని నేనడంలేదు. కాస్త మర్యాదన్నది ఉండాలంటున్నాను."

ఆయన పాయింటుప్రకారం నాదే తప్పవుతుంది మరి!

ఆయనేదో అనబోతుండగా, హనుమంతుడు లాగా దూకాడు మా హనుమంతాయ్ "బర్తు" మీదినుంచి.

"ఏమిటండీ మీరనేదీ?"

పెద్ద రౌడీ పోజుపెట్టి కిటికీలోంచి బయటికి చూస్తూ, ఆయనవైపేనా చూడకుండా అడిగాడు.

మావాడి దూకుడుతో కాస్త మెత్తబడ్డట్టు ఆయన మొహమే చెప్తోంది. అయినా ఆత్మాభిమానమనేది ప్రతివాడికీ ఉంటుంది. లేని ధైర్యం తెచ్చుకొని, మూతిబిగించి "లేవమంటున్నాను" అన్నాడు.

ఛర్రున యిటుతిరిగి గట్టిగా అరిచాడు క్రాపు సవరించుకుంటూ: "వాడు లేవనంటున్నాడు! అంతేనా? ఇకనేం, పోయి గార్డుని పిల్చుకొచ్చుకోండి. ఎక్కువగా మాట్లాడవలసిన అవసరం ఏముంది?"

ఇంతట్లో బండి ఆగింది. ఆయన దిగిపోయాడు, "చూడండి మిమ్మల్ని ఏంచేస్తానో"అన్నట్టు చూసి.

నేను కాస్త మెత్తబడ్డాను. "ఒరేయ్, పేచీ యెందుకు, బెడ్డుచుడదాం పాపం బాధపడతాడు" అన్నాను మహా పెద్దమనిషిలాగు.

"ఛా ఊరుకో, నీకసలు సిగ్గులేదు! నే తేల్చేస్తాను ఈయన సంగతేవిటో"అన్నాడు.

ఇంతలో గార్డుని పిల్చుకొచ్చాడాయన. మా అదృష్టంకొద్దీ ఆ గార్డు కాస్త మెతకవాడిలా కనిపించాడు.

"ఎందుకండీ తగాదాలు! కొంచెం ఆ బెడ్ ఆలా సర్దండి ఆయన కూచుంటారు, సరిపోతుంది. ఈమాత్రానికి గొడవెందుకూ"అన్నాడాయన.

మావాడు చరచర బయటికెళ్ళి, ఓ ఉపన్యాసం మొదలెట్టాడు. తన యింగ్లీషుమీద వాడికి చెడ్డ నమ్మకం. ఎన్నోసార్లు చెప్పాను నేనూ, "బాబూ, చాలామంది మాట్లాడుకోవలసిన భాష. కాస్త ఖూనీచెయ్యడం తగ్గించరా"అని. కాని వింటేనా?

ఈ పేచీ ఘటాలతో పెట్టుకొంటే యిక బండి కదలదనో, లేక మావాడి ఉపన్యాసం వినలేకనో, "పోయి కూర్చోండి మాష్టారూ, వాళ్ళే సర్దుకొంటారు"అనేసి విజిలు ఊదాడు గార్డు.

బండి కదిలింది. వెంటనే వాళ్ళిద్దరూ లోపలికొచ్చేశారు. ఈలోగా మా ఎదటిబెంచీమీది సీటు ఖాళీకావటమూ, యింకో పెద్దమనిషి పడక వెయ్యడమూ జరిగిపోయింది.

నేను గురకపెట్టేస్తున్నాను, కళ్ళురెండూ బలవంతంగా మూసుకొని. నా కాళ్ళదగ్గర కూచుని సిగరెట్ అంటించి భావకవి పోజులో పొగ వదుల్తూ "ఈ ప్రపంచంతో నాకేం సంబంధం" అన్నట్టు ఏదో ఆలోచిస్తూ ఉన్నాడు హనుమంతాయ్.

"అయితే మీరు లేవరన్నమాట."

"అన్నమాటే." ఎలాగైనా తగువు పెంచుకోవాలనుకొన్నాడు మావాడు. పరిస్థితి విషమించవచ్చు.

నాకే అసహ్యమనిపించిందిక! అసలాయన మొండితనం చూపిస్తున్నా, మొండిమనిషిలా లేడు, చాలా సంస్కారం ఉన్న మనిషిలా అవుపిస్తున్నాడు. ఏదో నిద్రలేకపోవడంవల్ల చిరాకుతో పేచీపెట్టుకొనిఉంటాడు. ఎలాగూ పెట్టుకొన్నాక ఓడిపోవడమనేది యిష్టంలేక, యిలా సాగదీస్తున్నాడు. అందువల్ల 'ఈయనతోటి ఏమిటిలే'అనిపించింది.

వెంటనే బెడ్ చుట్టి ఓమూలకి నెట్టి "కూర్చోండి. అసలు మీరు మొదట్లోనే సరిగ్గా అడిగినట్లయితే పడుకోడానికైనా చోటిచ్చిఉండేవాణ్ణి! మీరడగడంలో కొంచెం అమర్యాదగా అడగటాన యింత గొడవయింది. ఇప్పుడైనా మీ గార్డుని చూచి కాదు నేను లేస్త. తోటిమనిషిని కష్టపెట్టడం యిష్టంలేక"అన్నాను, విజయం నాదేనని స్పష్టపరుస్తూ.

మావాడు విసుగ్గా సిగరెట్ నేలకేసి కొట్టి గుడ్లు ఉరిమిచూచాడు నావైపు. నేను నవ్వాను. రెండూ గమనించాడాయన. ఇక వీళ్ళతో పేచీ ఎందుకనుకొన్నాడో ఏమో పోయి సీట్లో కూచున్నాడు. నేనలా తలుపుదగ్గరగా నిల్చున్నాను. బండి నడుస్తూ ఉంది. పావుగంట గడిచింది అలాగ. ఒంటికాలిమీద నిల్చోలేక మాటిమాటికీ కాలు మార్చుకొంటున్నాను. రెండుమూడుసార్లు ఓరగా గమనించానాయన్ని. నావైపు చూస్తూ ఉన్నాడు.

ఏమనుకొన్నాడో ఏమో, "కూర్చోండి" అన్నాడు జాలిచూపుతున్నట్టు.

ఒళ్లుమండింది నాకు మళ్ళీ! ఏదో నామీద దయతలచినట్టు మాట్లాడుతాడేమిటి? తను ఓడిపోయాననే సంగతి ఆయన తెలుసుకోనే లేనట్టుంది. లేకపోతే తెలిసికొనే, పశ్చాత్తాపపడి అంటున్నాడేమో!

అయినా నేను తగాదా పెంచుకోదలచుకోలేదు. హనుమంతరావు అప్పటికే నిద్రపోయాడు.

"ఫరవాలేదులెండి" అన్నాను ఆయనవేపు చూడకుండానే వ్యంగ్యంగా.

మరి మాట్లాడలేదాయన. కాసేపుండి నిద్రపోయాడు.

తెనాలిలో దిగే సరికి తెల్లవార బోతోంది. మసగ్గానే ఉందింకా. డూప్లికేటు ఎక్కాము. బండి కదలబోతోంది. ఇంతలోకే ఆయన పరుగెత్తుకొంటూ వస్తున్నాడు. కూలీ దొరకలేదు కాబోలు ఒకచేతిలో బెడ్డింగూ, మరోచేతిలోసంచీ పట్టుకొని ఎక్కలేక నానా అవస్థపడుతున్నాడు. నేనా బెడ్డింగూ, సంచీ అందుకొన్నాను. ఆయన లోపలికొచ్చాడు. ఇప్పుడుమాత్రం కాస్త కృతజ్ఞత చూపినట్టు నవ్వాడు.

"ఎక్కడికి మీరు గుంటూరేనా" అడిగాడు.

"అవునండి"

"ఏం చేస్తున్నారక్కడ?"

చదువుకొంటున్నాను"

"ఏ కాలేజీలో?"

చెప్పాను.

అదోరకంగా నవ్వాడాయన. ఏమనాలో తోచలేదు నాకు.

"మీరేం చేస్తున్నారు" అన్నాను.

మళ్ళీ అదేనవ్వు. ఈ మారు నేనూ నవ్వాను. ఐతే ఎందుకునవ్వానో నాకే తెలియదు.

గుంటూరు స్టేషన్లో ముందుగా దిగాడాయన. బెడ్డింగూ, అదీ, అందించాను.

"థాంక్స్. వస్తానండీ" అన్నాడు మళ్ళీ అదే నవ్వు నవ్వుతూ.

"మంచిదండీ"అన్నాను సీరియస్‌గా చూస్తూ.

"ఏమిటోయ్ అలా నవ్వుతాడు" అన్నాను హనుమంతరావుతో. మావాడు పళ్ళుతోముకొంటూ ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తున్నాడు యిందాకటినుంచీ గేటుదగ్గర నిల్చుని.

"అసలు వెధవ్వి నువ్వు చెడగొట్టావు. లేకపోతే అంతుకనుక్కొందును" అన్నాడు వేప్పుల్ల పారేసి పెట్టెదించుతూ.

"ఛా, పాపం! చాల మంచివాడులా ఉన్నాడురా. అయినా అతిగాపోవడం మంచిది కాదు. అసలు గెల్చింది మనమా, కాదా? ఆ సంగతి ఆయనకీ తెలుసు. గార్డును పిల్చుకొచ్చినందుకు లేవలేదుగా మనం. మనయిష్టమై లేచాము. అంతేనా! అలాంటప్పుడు విజయం మనదే కదూ?" అన్నాను వాణ్ణి సముదాయిస్తూ.

"ఏడిశావులే"అన్నాడు నవ్వుతూ ఎలాగో ఒకలాగు గెలిచామన్నసంగతి తానూ అంగీకరించినట్టు.

బండిదిగి చల్లగా రూమ్ కెళ్ళాము.

ముఖం కడుక్కుంటూ "ఏమిటోయ్ సంగతులూ" అని అడిగాను సుబ్బారావుని.

"ఏముందోయ్, మన N.S.K. గారు ప్రిన్సిపాల్‌గా వెళ్ళిపోయారు. రామ్మూర్తిగారు రిటైరైపోయారు. మరి నలుగురు కొత్తలెక్చరర్లువచ్చారు. అంతా కుర్రవాళ్ళే! అబ్బ! చెడ్డ పేచీవోయ్ వీళ్ళతో! చెప్పేది తక్కువా, డాబుసరి ఎక్కువానూ" అన్నాడు.

అప్పటికి పదిహేనురోజులవుతోంది మేం కాలేజీ వదలి. అందువల్ల కబుర్లతో కాలక్షేపం చేస్తూకూర్చున్నాము. గడియారం పదిచూపించింది.

"అబ్బ! నిద్రలేదురా రాత్రంతా! ఇవ్వాల్టికి నువ్వెళ్ళు" అన్నాడు హనుమంతం.

వాణ్ణి నమ్ముకొని లేటయినందుకు తిట్టుకొని త్వరత్వరగా పరుగెత్తాను. క్లాసు జరుగుతోంది. బోర్డుమీద గీసుకొంటూ పోతున్నారు ఎవరో కొత్తలెక్చరరు,వాకిట్లోనిల్చున్న నన్ను చూడకుండా.

"లోపలికి రానాండి?" అన్నాను.

"యాస్" అని ఇలా తిరిగారు.

గుండె "ఠా...ఆ...ప్" అని ఆటంబాంబులా మోగింది! గుడ్లు తేలేసి నోరు తెరిచి అలా ఉండిపోయాను.

గతరాత్రి యింతగొడవా చేసిన మా ట్రైయిన్ మేటు ఆయన! చాక్‌పీసు ఎగరేసి పట్టుకొని సన్నగా నవ్వుతూ "కమిన్ ప్లీజ్" అని అటెండెన్సు రిజిస్టరు తెరిచారు మా ట్రైయిన్ ... సారీ, లెక్చరరు!

★